TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం

ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి

జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 211 | శనివారం, ఆగస్టు 22, 2026 | పేజీలు : 04 | వెల రూ. 1.00/-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# కొండా ఫ్యామిలీపై.. రేవంత్ రెడ్డి సీరియస్



**క్రమశిక్షణ ఉల్లంఘనపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**మంత్రి కొండా సురేఖకు పీసీసీ షోకాజ్ నోటీసులు**

**పరకాల టికెట్ వ్యవహారంపై కాంగ్రెస్‌లో ముదిరిన వివాదం**

**సీఎంపై విమర్శలను సహించేది లేదని పార్టీ అధిష్ఠానం స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి పరకాలలో జరిగిన బహిరంగ సభలో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. దీంతో రేవూరి అభ్యర్థిత్వంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లయింది. అయితే మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ పరిణామం కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె వ్యాఖ్యలు చేయడంపై పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరైన రేవంత్ రెడ్డి ఈ అంశంపై కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి తన వైఖరిని స్పష్టం చేసినట్లు సమాచారం. సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరింది. అయితే కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాను ఎలా బాధ్యత వహిస్తానని మంత్రి సురేఖ ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



## సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ

**హోదా, పర్యటన ఉద్దేశానికి తగిన కార్యక్రమం లేదన్న కేంద్రం**

**విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టీకరణ**

**బ్రిటన్ పర్యటనకు అనుమతి.. అమెరికా పర్యటనకు మాత్రం నో**

**కేంద్రం నిర్ణయంతో అమెరికా పర్యటన రద్దు చేసుకున్న సీఎం**

**ప్రస్తుతం లండన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలకు అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. అయితే బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్‌కు చేరుకోవాల్సి ఉండగా, అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందుగానే హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించడంతో అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో తెలిపింది.

## మర్రి జనార్ధన్ రెడ్డిపై కేసు నమోదు

**నాగర్‌కర్నూల్ ఆసుపత్రి ఎదుట బీఆర్‌ఎస్ నేతల ధర్నా**

**అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహించారంటూ అభియోగం**

**విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులకు ఫిర్యాదు**

**మాజీ ఎమ్మెల్యేతో పాటు మరో 38 మందిపై కేసు**



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

బీఆర్‌ఎస్ నేత, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహించి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై మర్రి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సుమారు గంటపాటు రహదారిని దిగ్బంధించడంతో సాధారణ ప్రజలకు, రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం వారు అనుమతి లేకుండా ఆర్డీఓ కార్యాలయంలోకి ప్రవేశించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ కానిస్టేబుల్ పాత్లావత్ దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డితో పాటు మరో 38 మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



## పెల్లెట్ గన్ బాధితుడితో రాహుల్ గాంధీ ధర్నా

**ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులకు డిమాండ్**

**బాధితుడితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కాంగ్రెస్ ఎంపీ**

**జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ**

**పెల్లెట్ గన్స్ వాడలేదంటున్న ఢిల్లీ పోలీసులు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టగా, ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఘటనలో పలువురు నిరసనకారులకు గాయాలయ్యాయని, దీనికి వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుమార్లు స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న పోలీసుల వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

## గోల్కొండ కోట సమీపంలో పురాతన సొరంగం వెలుగులోకి

**కుతుబ్‌షాహీ కాలం నాటిదిగా అధికారుల ప్రాథమిక అంచనా**

**అగ్నివీరుల శిక్షణ కోసం భూమి చదును చేస్తుండగా గుర్తింపు**

**సమాచారం అందుకున్న పురావస్తు శాఖ.. నిలిచిన పనులు**

**సొరంగాన్ని చూసేందుకు భారీగా తరలివచ్చిన స్థానికులు**

3

# నా టార్గెట్ రేవంత్ రెడ్డే.. కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత

**సోనియా, రాహుల్, ప్రియాంకలపై గౌరవం ఉందన్న సుస్మిత**

**రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబంపై అవినీతి ఆరోపణలు**

**'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న**

**స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన**

**పరకాల నుంచే పోటీ చేయడం ఖాయమని వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. తన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కాదని, కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకునే చేశానని ఆమె స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ రెడ్డి పరకాలకు వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశాను.. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. అయితే రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని నేను భావిస్తున్నాను. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను" అని ఓ జాతీయ మీడియా ఛానల్‌తో మాట్లాడుతూ సుస్మిత పేర్కొన్నారు. ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇవ్వాలో నిర్ణయించడానికి సీఎం ఎవరు? అని ఆమె ప్రశ్నించారు. సీడబ్ల్యూసీ వంటి పార్టీ వ్యవస్థలు ఉన్నాయని, వాటి ప్రకారమే అభ్యర్థులను నిర్ణయిస్తారని అన్నారు. అవసరమైతే తాను స్వతంత్రంగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమని సుస్మిత ఇప్పటికే గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల పరకాలలో జరిగిన బహిరంగ సభలో వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఒక నియోజకవర్గ అభ్యర్థిత్వంపై సీఎం ఏకపక్షంగా ఎలా ప్రకటన చేస్తారని ఆమె ప్రశ్నించారు. సీఎం సోదరుడు ఏర్పాటు చేసిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆమె ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని, తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబానికి సంబంధించిన అవినీతి అంశాలను ఒక్కొక్కటిగా బయటపెడతానని సుస్మిత హెచ్చరించారు.



# ఉప్పుగూడలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

**అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు**
**భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక వ్రతం**
**వర్కాల సత్యనారాయణ నివాసంలో వేడుకలు**
**పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు**
**ఘనంగా నిర్వహించిన వరలక్ష్మీ వ్రత కార్యక్రమం**



**హైదరాబాద్, చాంద్రాయణగుట్ట, ఆగస్టు 21 (నేటి ప్రభాతదర్శిని):**

సామూహిక వరలక్ష్మీ వ్రతం వేడుకలను పురస్కరించుకొని ఉప్పుగూడలో హైదరాబాద్ జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షులు వర్కాల సత్యనారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన సామూహిక వరలక్ష్మీ వ్రతం వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వ్రతాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సి. సత్యనారాయణ, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ దార్ల యాదగిరి, లెక్చరర్ వి. శ్రీహరి, సీనియర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్, చార్మినార్ డివిజన్ పీస్ కమిటీ సభ్యులు జె. రామరాజు, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ కార్యదర్శి ఆడాల శివకుమార్, మహేష్ ముదిరాజ్‌తో పాటు మహిళలు అనిత, లత తదితరులు పాల్గొన్నారు.

# గౌలిపురాలో ఘనంగా ఆలే నరేంద్ర జయంతి

**ఆలే నరేంద్ర సేవలు ఎనలేనివని కొనియాడిన వక్తలు**
**80వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు**
**చిత్రపటానికి పూలమాలలు వేసిన ప్రముఖులు**
**ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు**
**పాల్గొన్న బీజేపీ నాయకులు, క్రీడాకారులు**



**హైదరాబాద్, యాకుత్‌పుర, గౌలిపుర, ఆగస్టు 21 (నేటి ప్రభాతదర్శిని):**

టైగర్ ఆలే నరేంద్ర చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వర్గీయ ఆలే నరేంద్ర 80వ జయంతి వేడుకలను పురస్కరించుకొని గౌలిపుర ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బీజేపీ సీనియర్ నాయకులు జమాల్‌పూర్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన భాయ్ సాబ్ జయంతి వేడుకల్లో అనేక మంది ప్రముఖులు పాల్గొని భాయ్ సాబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు దివంగత నేత ఆలే నరేంద్ర ఆశయాలను గుర్తుచేశారు. ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని సూచించారు. తెలంగాణ ముద్దుబిడ్డగా, కేంద్ర మాజీ మంత్రివర్యులుగా టైగర్ ఆలే నరేంద్ర చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్పోర్ట్స్ కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొని నరేంద్ర చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చా బీజేపీ అధ్యక్షులు కౌడి సురేందర్, బీజేపీ నాయకులు ధీరజ్ లాల్, డొంకి యాదగిరి, బీఎంఎస్ నాయకులు భుజేందర్ బాబు, నాయకులు ఎం. రమేష్, ఇమాన్యుల్, మహేష్, శైలేందర్ యాదవ్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# తంగళ్లపల్లిలో ఎస్‌హెచ్‌ఓగా అశోక్

**తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతల స్వీకరణ**
**ఎస్‌హెచ్‌ఓగా చార్జ్ తీసుకున్న ఎస్ఐ అశోక్**
**పోలీసు శాఖలో కీలక బాధ్యతలు**
**శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం**
**బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కు అభినందనలు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 21 (నేటి ప్రభాతదర్శిని):**



తంగళ్లపల్లి మండలంలో ఎస్‌హెచ్‌ఓగా ఎస్ఐ సిరిసిల్ల అశోక్ బాధ్యతలు స్వీకరించారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఎస్‌హెచ్‌ఓగా చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అశోక్ కృషి చేయనున్నారు.

# పెండింగ్ భూసేకరణ వేగవంతం చేయాలి

**భూసేకరణకు రూ.2,800 కోట్లు విడుదలకు ఆమోదం**
**కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**
**ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు**
**నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం**
**అధికారులకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలు**




**హైదరాబాద్, ఆగస్టు 21 (నేటి ప్రభాతదర్శిని):**

రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం వెంటనే రూ.2,800 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ప్రణాళిక ప్రకారం ఆయా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏయే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ చేపట్టవలసి ఉంది.. ఎప్పుడు పూర్తవుతాయి.. అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, ఎస్డీసీ రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు, భూసేకరణ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన పోచారం

**ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన పోచారం**
**పలు గ్రామాల విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులకు పరిష్కారం**
**బాన్సువాడ నుంచి ఎస్ఆర్ఎన్‌కే కళాశాల వరకు బస్సు**
**ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో నడపాలని సూచన**
**పోచారంకు విద్యార్థినుల కృతజ్ఞతలు**



**బాన్సువాడ, ఆగస్టు 21 (నేటి ప్రభాతదర్శిని):**

కొల్లూరు, దామరంచ, రైతునగర్, అన్నారం, చించోలి, కిష్టాపూర్, బీర్కూర్, తిమ్మాపూర్, బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా పరిసర గ్రామాల నుంచి ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేయించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక బస్సు సర్వీస్‌ను శుక్రవారం బాన్సువాడ బస్టాండులో ప్రారంభించి, విద్యార్థులతో కలిసి స్వయంగా బస్సులో ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల వరకు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్, ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 7వ తేదీన బాన్సువాడ పట్టణం నుంచి తిమ్మాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అభివృద్ధి పనుల నిమిత్తం వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో కిష్టాపూర్, బీర్కూర్ పరిసర గ్రామాలకు చెందిన ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ సమస్యను పోచారం దృష్టికి తీసుకువచ్చారు. సమయానికి కళాశాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలియజేయడంతో పోచారం వెంటనే స్పందించి బాన్సువాడ డిపో మేనేజర్ శ్రీ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోచారం సూచనల మేరకు బాన్సువాడ నుంచి కొల్లూరు, దామరంచ, రైతునగర్, అన్నారం, కిష్టాపూర్, బీర్కూర్, తిమ్మాపూర్, బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా మీదుగా ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల వరకు ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఈ ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో నడిపించాలని బాన్సువాడ డిపో మేనేజర్‌కు పోచారం సూచించారు. తమ సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించి, ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయించిన పోచారం శ్రీనివాసరెడ్డికి విద్యార్థినులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## కడప ఎంపి అవినాశ్ రెడ్డి ఇంట్లో 24 లక్షలు సీజ్

కడప,ఆగస్ట్21(నేటి ప్రభాత దర్శిని): కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసంలో లెక్క చూపని రూ.24 లక్షలు సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం అధికారిక ప్రకటన చేసింది. ఎంపీ నివాసంలో రెండు బ్యాంక్ లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నెల రోజుల ముందే వివేకా హత్యకు కుట్ర జరిగిందని దస్తగిరి వెల్లడించారని గుర్తు చేసింది. హత్య కోసం దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి రూ.40 కోట్లు ఆఫర్ చేశారని పేర్కొంది. రూ.40 కోట్లలో వాటాగా రూ.5 కోట్లు.. దస్తగిరికి ఇస్తానని ఎర్ర గంగిరెడ్డి ప్రలోభపెట్టారని ఈడీ చెప్పింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్లు ఆధారంగా ఇఅఎఖీ నమోదు చేసినట్లు తెలిపింది. కేసు నమోదు చేశామని ఈడీ వివరించింది. ఈ సోదాల్లో నేరానికి సంబంధించిన.. కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలు సీజ్ చేశామని ఈడీ స్పష్టం చేసింది.

# అంకిరెడ్డిపల్లిలో మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

**ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణ పనులకు శ్రీకారం**
**మహిళా సంఘాల సమావేశాలకు భవనం వినియోగం**
**శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు వేదికగా ఏర్పాటు**
**సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించే కేంద్రం**
**త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తాం: రాగుల రాజిరెడ్డి**

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 21 (నేటి ప్రభుత్వ దర్శిని):**

తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో నూతన మహిళా భవన నిర్మాణానికి నాయకులు భూమిపూజ నిర్వహించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (వీ+చీ=జు+లా) నిధులతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, స్థానిక సర్పంచ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాగుల రాజిరెడ్డి మాట్లాడుతూ మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సమావేశాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలకు శిక్షణా తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు భవనం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఇది కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రజా ప్రయోజనకరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిల్ల రైట్ రమేష్, వార్డు సభ్యులు చింతల రవి, సింగిరెడ్డి అనసూర్యతో పాటు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# బాన్సువాడ డివిజన్ లో ప్రైవేట్ పాఠశాలల బంద్ - ట్రస్మా ప్రకటన

**నేటి ప్రభాత దర్శిని బాన్సువాడ ప్రతినిధి.**



నల్గొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఘటనను ఖండిస్తూ శుక్రవారం బాన్సువాడ డివిజన్ లోని ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటించినట్లు ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్) ప్రకటించింది. ఈ సందర్భంగా బాన్సువాడ ట్రస్మా అధ్యక్షులు పాశం రాజిరెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులను, చదువు నేర్చుకుంటున్న విద్యార్థులే హత్య చేయడం తీవ్రంగా బాధించిందని అన్నారు. విద్యార్థుల అలవాట్లు, మానసిక స్థితిపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని, పిల్లలు పొరపాటు చేస్తే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వాలు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. హత్యకు గురైన ప్రిన్సిపాల్ రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నేటి ప్రభాతదర్శిని
TS 24 0026809
www.netiprabhatadarshini.in 94932 72754

# వయోవృద్ధుల హక్కులకు చట్టమే రక్షణ





**ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన**
**వయోవృద్ధుల హక్కులు, చట్టపరమైన పరిష్కారాలపై అవగాహన**
**ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచన**
**లోక్ అదాలత్‌తో వివాదాలకు సత్వర పరిష్కారం**
**వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణపై న్యాయవాదుల వివరణ**

**కరీంనగర్, ఆగస్టు 21 (నేటి ప్రభాతదర్శిని):**

వయోవృద్ధుల హక్కులకు చట్టాలే అండగా నిలిచి రక్షిస్తాయని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు చిట్టి చంద్రప్రకాశ్ రెడ్డి, పెరుక రంగయ్య అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ శ్రీ ఎస్. శివకుమార్ అనుమతితో, ఇన్‌చార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీమతి కే. రాణి ఆదేశాలతో న్యాయ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్‌లోని ప్రణామ్ సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు చిట్టి చంద్రప్రకాశ్ రెడ్డి, పెరుక రంగయ్య, సెంటర్ గౌరవ అధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, కోశాధికారి చింతల సత్యనారాయణ, లీగల్ ఎయిడ్ అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఎలుగు తన్మయి, ఎస్. భావన, విశ్రాంత రెవెన్యూ అధికారి ఈశ్వరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007, నిబంధనలు-2011లోని ముఖ్యమైన అంశాలను వివరించారు. వయోవృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యత, వారి హక్కుల పరిరక్షణ, నిర్లక్ష్యం లేదా వేధింపులకు గురైన సందర్భాల్లో అందుబాటులో ఉన్న చట్టపరమైన పరిష్కారాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. వయోవృద్ధులు తమ హక్కులను తెలుసుకుని, అవసరమైనప్పుడు చట్టపరమైన సహాయాన్ని పొందాలని సూచించారు. తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణకు సంబంధించిన జవాబుదారీతనం, పర్యవేక్షణ చట్టం-2026లోని ముఖ్యమైన అంశాలతో పాటు కుటుంబ సభ్యుల సామాజిక, నైతిక బాధ్యతలను వివరించారు. ఉచిత న్యాయ సేవలు పొందే హక్కు, అర్హులైన వ్యక్తులకు ఉచిత న్యాయ సలహా, న్యాయ సహాయం, న్యాయవాది సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు తమకు సంబంధించిన వివాదాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయ సహాయం పొందకుండా వెనుకడుగు వేయాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్నవారు జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థను సంప్రదించవచ్చని వివరించారు. కోర్టు కేసులను సత్వరంగా, పరస్పర అంగీకారంతో స్నేహపూర్వకంగా పరిష్కరించుకునేందుకు 'లోక్ అదాలత్' ఒక సమర్థవంతమైన ప్రత్యామ్నాయ వేదిక అని తెలిపారు. అదేవిధంగా 'శాశ్వత లోక్ అదాలత్' గురించి వివరిస్తూ, ప్రజా ప్రయోజన సేవలకు సంబంధించిన వివాదాలను కోర్టుకు వెళ్లకముందే రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని అన్నారు. లోక్ అదాలత్ అవార్డుకు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని తెలిపారు. వయోవృద్ధులు ఒంటరిగా ఉన్నప్పుడు లేదా కుటుంబ, ఆస్తి, పోషణ, పెన్షన్ తదితర సమస్యలను ఎదుర్కొన్నప్పుడు మౌనంగా ఉండకుండా అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టం తెలుసుకోవడం మాత్రమే కాకుండా, అవసరమైన సమయంలో చట్టాన్ని ఉపయోగించుకోవడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రణామ్ సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంకిరెడ్డిపల్లిలో మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

**ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం**
**మహిళా సంఘాల సమావేశాలకు భవనం వినియోగం**
**శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు వేదికగా నిలుపుదల**
**సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు కేంద్రం**
**త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి**



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో నూతన మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ +PJQUHJV, నిధులతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, స్థానిక సర్పంచ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాగుల రాజిరెడ్డి మాట్లాడుతూ మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సమావేశాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలకు శిక్షణా తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు భవనం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఇది కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రజా ప్రయోజనకరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిల్ల రైట్ రమేష్, వార్డు సభ్యులు చింతల రవి, సింగిరెడ్డి అనసూర్యతో పాటు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## వృద్ధుల పట్ల గౌరవం - సమాజ ప్రగతికి ప్రతీక

**వృద్ధులను భారంగా కాకుండా మార్గదర్శకులుగా చూడాలి**
**వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలి**
**రంగినేని ట్రస్టులో వృద్ధులకు పండ్ల పంపిణీ**



**సిరిసిల్ల, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

వృద్ధుల పట్ల గౌరవం చూపడం సమాజ ప్రగతికి ప్రతీక అని, వృద్ధులను భారంగా కాకుండా సమాజానికి విలువైన మార్గదర్శకులుగా చూడాలని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు అన్నారు. శుక్రవారం రగుడులోని రంగినేని ట్రస్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి బి. పుష్పలత ఆదేశాలతో, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి డీఎల్ఎస్ఏ పి. లక్ష్మణాచారి సమన్వయంతో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు Pdlqwhqdqfh#dqg#Zhoiduh ri# Sduhqwv# dqg# Vhqlru# Flwl}hqv# Dfw, 2007 వంటి చట్టపరమైన రక్షణలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ హక్కులకు భంగం కలిగినప్పుడు సంబంధిత అధికారులను లేదా న్యాయ సేవా సంస్థలను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని అవగాహన కల్పించారు. అనంతరం ట్రస్టులోని వృద్ధులకు న్యాయ సేవాధికార సంస్థ తరఫున పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, బూర మధుసూదన్, రంగినేని ట్రస్టు ప్రిన్సిపల్ వెంకట్రావు, ట్రస్టు ఇన్‌చార్జి తిరుమల్ రెడ్డి, హెడ్‌మాస్టర్ ఎండీ. అంకుస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ లింగంపల్లి మధుసూదన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## గోల్కొండ కోట సమీపంలో పురాతన సొరంగం వెలుగులోకి

**హైదరాబాద్, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గోల్కొండ కోట సమీపంలో ఓ పురాతన సొరంగం బయటపడింది. ఈ సొరంగం కుతుబ్‌షాహీ కాలం నాటిదిగా అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అగ్నివీరుల శిక్షణ కోసం భూమిని చదును చేస్తుండగా భూగర్భంలోని ఈ నిర్మాణం అనుకోకుండా వెలుగులోకి వచ్చింది. గోల్కొండ కోట పరిసర ప్రాంతమైన అత్తాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నివీరుల శిక్షణ కోసం గోల్కొండ ఆర్టిలరీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో భూమిని ఎత్తుపల్లాలు లేకుండా చదును చేస్తుండగా సొరంగ మార్గం కనిపించింది. దీంతో అధికారులు వెంటనే పనులను నిలిపివేసి కేంద్ర పురావస్తు శాఖ అధికారులకు సమాచారం అందించారు. భారీ రాతి పలకలతో కప్పి ఉన్న ఈ సొరంగంలోకి వెళ్లేందుకు వీలుగా మార్గం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జనసంచారం తక్కువగా ఉండే ఈ ప్రాంతంలో పురాతన సొరంగం బయటపడిందన్న విషయం తెలియడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో పికెట్ ఏర్పాటు చేశారు. సొరంగం ఎంత పొడవు ఉంది? దాని లోపల ఏవైనా చారిత్రక కళాఖండాలు ఉన్నాయా? అనే అంశాలపై స్థానికులు, చరిత్రకారుల్లో ఆసక్తి నెలకొంది. పురావస్తు శాఖ చేపట్టబోయే పరిశోధనలు, తవ్వకాలతో ఈ సొరంగానికి సంబంధించిన మరిన్ని కీలక చారిత్రక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## సినారె కళామందిరం సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**
**కళామందిరం భవనం, ఆవరణ పరిశీలన**
**లైటింగ్, సీటింగ్ ఏర్పాట్లపై దృష్టి**
**సౌండ్ సిస్టం, మౌలిక వసతులపై ప్రతిపాదనలు**
**అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలన**





**వేములవాడ, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరం సుందరీకరణ పనులకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె సినారె కళామందిరం భవనం, ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కళామందిరం భవనం సుందరీకరణతో పాటు లైటింగ్, సీటింగ్, సౌండ్ సిస్టం, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కళామందిరం అభివృద్ధికి అవసరమైన పనులను సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట వేములవాడ ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో వైభవంగా వరలక్ష్మీవ్రతాలు

శ్రీశైలం,ఆగస్ట్21(నేటి ప్రభాత దర్శిని):శ్రీశైలం మహా క్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి ఉత్తర భాగంలోని చంద్రావతి కల్యాణ మండపంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపారు. వేదికపై వరలక్ష్మీదేవి, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాల్లో 1500 మంది మహిళలు పాల్గొని వ్రతాలు నిర్వహించారు.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

**బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ**
**రూ.15 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్న నేతలు**
**విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం కాపాడాలి**
**బకాయిలు విడుదల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం**
**స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేని ప్రభుత్వం రాజీనామా చేయాలి**



**బాన్సువాడ, ఆగస్టు 21 (నేటి ప్రభాత దర్శిని):**

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడ పట్టణంలో బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ ఇచ్చి ఉన్నత చదువులు చదివిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేని ప్రభుత్వం, ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ గజ్జల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉమేష్, రూరల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నసురుల్లాబాద్ మండల అధ్యక్షుడు హనుమాన్లు, బీర్కూర్ మండల అధ్యక్షుడు సాయికిరణ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, బీజేవైఎం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా కో-ఆప్షన్ నెంబర్ తృప్తి ప్రసాద్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, పాశం భాస్కర్ రెడ్డి, రాజాసింగ్, శివశంకర్, పురుషోత్తం, సచిన్, ప్రదీప్, మహేందర్, విశాల్, నాగరాజు, సాయిరెడ్డి, యోగి, సాయికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

**వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్**



టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి.దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.

## ఇరుముడి ఎమోషనల్ డ్రామా





రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

## వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ

టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.




# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.